## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం




JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:314 | సోమవారం జూన్ 15, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00



## పశ్చిమాసియా సంక్షోభంలోనూ దేశం ప్రగతి పథంలో: నిర్మలా సీతారామన్



- పశ్చిమాసియా సంక్షోభంలోనూ భారత్ ప్రగతి పథంలోనే ఉంది.
- దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేందుకు కేంద్రం చర్యలు తీసుకుంది.
- భాజపా పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.
- యూపీఐ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ, కుటుంబాల సంక్షేమం విషయంలో తాము చూపిస్తున్న శ్రద్ధను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించలేకపోతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆయన లోక్‌సభలో మాట్లాడిన ప్రతిసారీ కేవలం విమర్శలకే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ, కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే క్రమంలో.. దేశం సాధించిన విజయాలను ఆయన తక్కువ చేసి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని ఈమేరకు ప్రసంగించారు.

2లో ▶



## రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్డీయే!

- రాజ్యసభలో 2/3 మెజారిటీకి ఎన్డీయే చేరువలో ఉంది.
- ఝార్ఖండ్, మిజోరం ఎన్నికల తర్వాత ఎన్డీయే బలం 151కి చేరే అవకాశం.
- తృణమూల్ ఉపఎన్నికల సీట్లు గెలిస్తే బలం 154కు పెరగొచ్చు.
- 2/3 మెజారిటీకి రాజ్యసభలో 163 మంది ఎంపీల మద్దతు అవసరం.
- లోక్‌సభలో మాత్రం ఎన్డీయేకు 2/3 మెజారిటీ ఇప్పట్లో కష్టమే.

2లో ▶

## దిల్లీ అగ్నిప్రమాదం.. ప్లాన్ ప్రకారం చేసిందే..



దిల్లీలోని తుగ్లకాబాద్‌లో ఓ ఇంటి బేస్‌మెంట్‌లో శుక్రవారం మంటలు చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. ముందుగా అనుమానించినట్లుగా ఈ పేలుడు ప్రమాదవశాత్తు చోటుచేసుకోలేదని.. ప్లాన్ ప్రకారమే బేస్‌మెంట్‌లోని వాహనాలకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తుండగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. అందులో ఘటనకు ముందు ఓ అమ్మాయి ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని భవనం లోపలికి వెళ్లిన దృశ్యాలు రికార్డ్ అయ్యాయన్నారు. మంటలు అంటుకున్న వెంటనే ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు.

2లో ▶

## కృష్ణా నదిలో పడవ బోల్తా.. నలుగురు మృతి



అచ్చంపేట: పల్నాడు జిల్లా కోనూరులో విషాదం చోటుచేసుకుంది. కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా గుర్తించారు. 10 మంది బంధువులు కోనూరులో జరిగే ఓ వేడుకకు పడవపై వెళ్లి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో నదిలో పడవ బోల్తా పడటంతో వారంతా నీట మునిగిపోయారు. వీరిలో ఆరుగురిని గ్రామస్థులు కాపాడారు. మిగిలిన నలుగురు గల్లంతయ్యారు. పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టగా.. వారి మృతదేహాలు లభ్యమయ్యాయి.

## భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉంది



### మోదీ ప్రధానాంశాలు

- భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉంది.
- సుస్థిర భవిష్యత్తు, ప్రపంచ మేలు కోసం భారత్ ఆవిష్కరణలు చేస్తోంది.
- యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి ప్రయోజనం చేకూర్చే పరిష్కారాలు కనుగొంటున్నారు.
- కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉంది.
- 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు.. నిరంతరం సాగుతూనే ఉంటుంది.
- దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లు ఉన్నాయి.
- భారత్ ఆవిష్కరణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయి.
- భారత్ ఆవిష్కరణలను వినియోగించుకునే దేశమే కాదు..
- సహకారం అందించే దేశంగా ఎదిగింది.

### మెక్రాన్ వ్యాఖ్యలు

- 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రశంసించారు.
- తమ దేశం కూడా వివిధ రంగాల్లో భాగస్వామిగా ఉందని చెప్పారు.
- భారత్‌ను 'ఆవిష్కరణల దేశం'గా పేర్కొన్నారు.
- ఏఐ, వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందన్నారు.
- పౌర అణుశక్తి రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవడానికి ఆస్కారం ఉందన్నారు.

### కార్యక్రమం వివరాలు

- ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ నీస్ నగరంలో 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో పాల్గొన్నారు.
- భారత్--ఫ్రాన్స్ ఇన్నోవేషన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం.
- స్టార్టప్‌లు, రీసెర్చ్, సుస్థిర భవిష్యత్‌పై చర్చలు జరిగాయి.
- రెండు దేశాల యువ ఆవిష్కర్తలు, నిపుణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు కోసం భారత్ ఆవిష్కరణలు చేస్తోందన్నారు. తమ దేశానికి చెందిన యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి ప్రయోజనాలు చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని తెలిపారు. "కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉంది. మేం చేపట్టిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు.. అది నిరంతరం సాగుతూనే ఉంటుంది. మా దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లున్నాయి. ఇవి దేశంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ బలాన్నిస్తున్నాయి. మా దేశం ఆవిష్కరణలను వినియోగించుకునే దేశం మాత్రమే కాదు.. ఆ రంగానికి సహకారం అందించేదిగానూ ఆవిర్భవించింది" అని మోదీ పేర్కొన్నారు.

*భారత్ ఆవిష్కరణలు ప్రపంచ మేలు కోసం.. సహకారం అందించే దేశంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.*

**అమెరికా కోసం ఇరాన్ ప్రమాదకర ఉచ్చు!**

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రశంసించారు. తమ దేశం కూడా వివిధ రంగాల్లో ఇందులో భాగస్వామిగా ఉందన్నారు. భారత్‌ను 'ఆవిష్కరణల దేశం'గా పేర్కొన్నారు. ఏఐ, వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందని చెప్పారు. పౌర అణుశక్తి రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవడానికి ఆస్కారం ఉందన్నారు.


## రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్: కేటీఆర్



2లో ▶

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు.. ఆరా తీసిన హోం మంత్రి

- చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసుపై హోం మంత్రి అనిత ఆరా తీశారు.
- కాకినాడ జిల్లా ఎస్పీతో మాట్లాడి కేసు వివరాలు తెలుసుకున్నారు.
- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు గాలింపు చేపట్టాయి.
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి సూచించారు.
- కేసుపై ప్రభుత్వం అత్యంత



2లో ▶



# సంపాదకీయం

## మోదీ వల.. విపక్షం విలవిల

రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతేగా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది.

ప్రధాని మోదీ దేశ ప్రజలు, ముఖ్యంగా యువత మనోభావాలను పసిగట్టి అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకొని ఎన్నికల్లో విజయాలు సాధిస్తుండగా, ఇండియా కూటమి నేతలు మాత్రం పాత చింతకాయ పచ్చడి ఆలోచనలతోనే అడుగులు వేస్తున్నారు. దీంతో ఇండియా కూటమి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో బలమైన నేతల కోసం మోదీ అన్వేషణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హరీశ్ రావు కోసం తెర వెనుక ప్రయత్నాలు కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డిని తనతో చేతులు కలపాలని బహిరంగంగానే ఆయన కోరారు. ఈ మాట సరదాగా అన్నట్టు పైకి అనిపించినా ప్రధాని ఆంతర్యం అర్థం కావాల్సిన వారికి అర్థమైంది.

నిన్నటి వరకు కేంద్రంలో బీజేపీని గద్దె దించుతామని గర్జించిన దీదీ మమతా బెనర్జీ ఇప్పుడు తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తృణమూల్‌ను కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి కూడా సిద్ధపడుతున్నట్టు వార్తలొస్తున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌లోనే ఉండిన ఆమె ఆ పార్టీతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం గమనార్హం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏకబిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నాయకుడిగా నరేంద్ర మోదీ దేశ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సంబరాలు జరుపుకోగా, మోదీని నిలువరించడం ఎలా? అని ప్రతిపక్ష ఇండియా కూటమి తల పట్టుకుంటోంది. నిజానికి భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ... మోదీకంటే ఎక్కువ రోజులు ప్రధానమంత్రులుగా కొనసాగారు. నెహ్రూ సైతం మూడు పర్యాయాలు వరుసగా ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ వయోభారం, అనారోగ్య సమస్యలతో ప్రధానమంత్రిగా ఉండగానే కన్నుమూశారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే హత్యకు గురయ్యారు. ఈ కారణంగా ప్రధాని మోదీ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. రాజకీయాలలో ఈ శతాబ్దం నాది అని మోదీ సగర్వంగా చెప్పుకోగలుగుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజులతో పోల్చితే వర్తమాన రాజకీయాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం ఎలా? అని ఇదే భారతీయ జనతా పార్టీతో సహా అనేక ప్రతిపక్షాలు తల పట్టుకోగా, ఇప్పుడు మోదీ శక్తియుక్తుల ముందు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు నిస్సహాయంగా మిగిలాయి. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ నియంతలా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం బలపడటంతోపాటు ఆమె దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడంతో నాడు ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో రైటిస్టులు, లెఫ్టిస్టులు ఏకమై జనతా పార్టీకి పురుడు పోశారు. 1977 ఎన్నికల్లో జేపీ ఆధ్వర్యంలో జనతా పార్టీ ఇందిరా గాంధీని ఓడించి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, నాయకుల మధ్య విభేదాల కారణంగా జనతా పార్టీ ప్రభుత్వం ఎంతో కాలం నిలవలేదు. ఇందిరా గాంధీ మళ్లీ అధికారంలోకి వచ్చారు. అయితే, పదవీకాలం పూర్తి కాకుండానే ఆమె తన సొంత అంగరక్షకులైన సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ చేతిలో హత్యకు గురయ్యారు. ఇది చరిత్ర!

ఎవరు గొప్ప?

తొలి ప్రధాని నెహ్రూకంటే ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గొప్పవారా? అంటే ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. వర్తమాన రాజకీయాలలో మోదీ మహాబలుడని మాత్రం చెప్పవచ్చు. ఒక నాయకుడు మూడు ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత బలహీనపడటం, ప్రతిపక్షాలు బలం పుంజుకోవడం సహజం. అయితే ఇప్పుడు దేశ రాజకీయాలలో ఆ పరిస్థితి లేదు. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో కొంత బలహీనపడినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మరింత బలపడ్డారు. ప్రధాని మోదీని ఢీకొనడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. అయితే, ఆ కూటమికి 1977లో వలె జయప్రకాశ్ నారాయణ్ వంటి సమర్థ నాయకత్వం లేకపోవడంతో పుంజుకోలేక పోతోంది. ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్ గాంధీ నాయకత్వంపై భాగస్వామ్య పక్షాలకు విశ్వాసం లేకపోవడంతో ఎవరికి వారు తామే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఊహల పల్లకిలో ఊరేగారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండేవి. ఇది గమనించిన మోదీ ఆ పార్టీలపై దృష్టి కేంద్రీకరించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కేంద్ర స్థానమైన ఢిల్లీపై నజర్ పెట్టారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీలోనే ఓడించి బీజేపీని అధికార పీఠంపై కూర్చోబెట్టారు. ఎన్నికల్లో ఓటమితో పాటు లిక్కర్ స్కాంలో జైలుకు కూడా వెళ్లిన కేజ్రీవాల్ ప్రస్తుతం ఇండియా కూటమితో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. రాజకీయంగా ఎదురుదెబ్బలు తగలక ముందు కాంగ్రెస్ పార్టీ కంటే తమదే పెద్ద పార్టీ అని, ఇండియా కూటమికి తానే నాయకత్వం వహిస్తానని, కుదిరితే తానే ప్రధానమంత్రి కావాలని కేజ్రీవాల్ కలల ప్రపంచంలో విహరించారు. కారణం తెలియదుకానీ ప్రస్తుతం ఆయన సైలెంట్‌గా ఉంటున్నారు.

నిన్నటి వరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ కూడా ప్రధాని కావాలని ఉవ్విళ్లూరారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ కూటమికి ఆ పార్టీ నాయకత్వం వహించడాన్ని ఆమె వ్యతిరేకిస్తూ వచ్చారు. కూటమిలోని మిగతా పార్టీల నాయకులు ప్రధానమంత్రి పదవిని కోరుకోకపోయినా సొంత ఎజెండాలతో ముందుకు సాగారు. అదే సమయంలో ఇండియా కూటమికి బలమైన నాయకత్వం అందించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, తమిళనాడులో జరిగిన తాజా ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాలైన తృణమూల్, డీఎంకే పార్టీలు ఓడిపోయాయి. ఓటమి తర్వాత అంతర్గత తిరుగుబాటుతో మమతా బెనర్జీ సతమతమవుతూ ఉండగా, ఎన్నికల ఫలితాల తర్వాత మాట మాత్రం చెప్పకుండా కాంగ్రెస్ పార్టీ తమను కాదని జోసెఫ్ విజయ్‌కి మద్దతు ప్రకటించడంపై డీఎంకే అధినేత స్టాలిన్ ఆగ్రహం చెందారు. దీంతో ఇండియా కూటమిపై ఆయన అలిగారు. కాంగ్రెస్ పార్టీతో దశాబ్దాలుగా కొనసాగిన స్నేహానికి కటీఫ్ చెప్పారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్ దూరం కావడంతో ఇండియా కూటమి బలహీనపడింది. మమతా బెనర్జీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. క్షవరం అయితేగానీ వివరం తెలియదు అన్నట్టుగా ఇండియా కూటమి ఉలిక్కిపడి తాజాగా సమావేశమై కూటమి బలోపేతంపై చర్చలు జరిపింది. అయితే, ఈ సమావేశంలో కూడా వినూత్నంగా ఆలోచించకుండా... ప్రజలను ఆకట్టుకోలేకపోయిన 'సర్' వంటి అంశాలతోనే ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ దేశ ప్రజలు, ముఖ్యంగా యువత మనోభావాలను పసిగట్టి అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకొని ఎన్నికల్లో విజయాలు సాధిస్తుండగా, ఇండియా కూటమి నేతలు మాత్రం పాత చింతకాయ పచ్చడి ఆలోచనలతోనే అడుగులు వేస్తున్నారు. దీంతో ఇండియా కూటమి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్డీయే కూటమిలో ప్రధాన పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ నానాటికీ బలపడుతుండగా, ఇండియా కూటమిలోని ప్రధాన పక్షమైన కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోలేక పోతున్నది. ప్రధాని మోదీ ఎత్తుగడలతో పాటు ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి.

## తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షాలు!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని.. నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇవాళ, రేపు, ఎల్లుండి కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## అఖిలేశ్ కూతురిపై ట్రోలింగ్.. సీఎం యోగి సీరియస్

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో



జరుగుతున్న ప్రచారాన్ని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. నేతల కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావొద్దని హితవు పలికారు. అఖిలేష్ యాదవ్ కుమార్తెపై అసభ్యకరమైన కామెంట్స్‌తో మార్ఫింగ్ చేసిన చిత్రాలను కొందరు దుండగులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ దీనిపై స్పందించారు. "అఖిలేష్ యాదవ్ కుమార్తె లక్ష్యంగా కొందరు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. ఆ పోస్టులు నా దృష్టికి వచ్చాయి. నిందితులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆడపిల్లలు అందరికీ సమానమే. వారిని గౌరవించాలి. ప్రతి ఇంట్లో కుమార్తె, సోదరి ఉంటారు. ఇతరులను కూడా అదే భావనతో చూడాలి. ఆయన కుమార్తె నాకు కుమార్తెతో సమానం. తేడా ఏమీ చూపించను. దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం అన్నారు.

## అమెరికా ఆజ్ఞలను మోదీ పాటిస్తున్నారు: రాహుల్ ఆరోపణ

అమెరికా దాడుల్లో భారతీయ నావికులు మరణించడంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులపై ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని



ఆరోపించారు. అగ్రరాజ్యం ఆంక్షలకు ఆయన లొంగిపోయారంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడులు చేయడంతో ముగ్గురు దేశీయ నావికులు మరణించిన సంగతి తెలిసిందే. దాడులపై నిరసన తెలియజేస్తూ భారత విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ అమెరికా సెక్రటరీ మార్క్ రూబియోతో మాట్లాడారు. ఈ క్రమంలోనే వాణిజ్య నౌకలు యూఎస్ మిలిటరీ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని, ఇరాన్‌పై ఉన్న అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తే సహించబోమని రూబియో అన్నారు. ఈ వ్యాఖ్యలను రాహుల్ ప్రస్తావిస్తూ.. 'అమెరికా ఆదేశాలను ఏ దేశం సహించదు. కానీ మన రాజీపడ్డ ప్రధాని అగ్రరాజ్యం ఆంక్షలకు లొంగిపోయారు. విదేశీ అధికారం భారత పౌరులను చంపేస్తున్నా ప్రధాని ఆ దేశ ఆజ్ఞలను పాటిస్తూ విధేయత కనబరుస్తున్నారు. వారి దాడుల్లో భారత నావికులు మరణించినా అమెరికా ఇప్పటికీ పశ్చాత్తాపపడడం లేదు. అదనంగా ఆంక్షలకు కొనసాగిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

## అగ్నిప్రమాదం వదంతులతో పట్టాలపైకి.. రైలు ఢీకొని నలుగురి మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని హేతమ్‌పుర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఖజురహో- ఉదయ్‌పుర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు చెలరేగాయన్న వదంతులతో అలారం చైను లాగారు. రైలు ఆగిన తర్వాత పలువురు ప్రయాణికులు హడావుడిగా



కిందకు దిగి.. పక్కనున్న పట్టాలపైకి చేరుకున్నారు. అంతలోనే ఆ పట్టాలపై దూసుకొచ్చిన పాతాళ్ కోట్ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొంది. ఈ ఘటనలో చిన్నారి సహా నలుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

## పశ్చిమాసియా సంక్షోభంలోనూ దేశం ప్రగతి పథంలో: నిర్మలా సీతారామన్

మొదటిపేజీ తరువాయి

"భారీ విపత్తు ముంచుకొస్తోందని, రాబోయే కొద్ది వారాల్లో అంతా కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ తరచూ అంటుంటారు. ఆయన చెబుతున్నట్లుగా దేశంలో ఎటువంటి సంక్షోభం లేదు. ఆర్థిక వ్యవస్థ ఏటికేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. జీడీపీ గణాంకాలూ దీనిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా ఇదే విషయాన్ని పేర్కొంది. అయినప్పటికీ.. భారత్ సంక్షోభంలో ఉందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనూ దేశం ప్రగతి పథంలో సాగుతోంది. ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రధాని మోదీ (ఛ్థుతీవఅనతీథు వీశీఱ) చర్యలు తీసుకున్నారు.

**విడాకుల కోసం ఐదేళ్లు పోరాడి.. మళ్లీ ఒక్కటై..**

మోదీ నేతృత్వంలో భాజపా (దీభీూ) 12 ఏళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమంతో సాగింది. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల కింద 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించాం. ప్రస్తుతం దేశంలో 58 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. 144 కోట్ల ఆధార్‌లు, 125 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలకు 'యూపీఐ' ఓ నమూనాగా మారింది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

## రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్డీయే!

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో ఎన్డీయే బలం పెరుగుతోంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథయంలో ఎగువ, దిగువ సభల్లో ఎన్డీయే బలం పుంజుకుంటోంది. ముఖ్యంగా రాజ్యసభలో మూడింట రెండొంతుల (2/3) మెజారిటీకి చేరువవుతోంది. రాజ్యాంగ సవరణ బిల్లుల సమయంలో ఈ మెజారిటీ ఎన్డీయేకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో లోక్‌సభలో మాత్రం మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకాస్త దూరంలో నిలవనుంది.

ఝార్ఖండ్, మిజోరంలో రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు (భాజపా మద్దతు) గెలిస్తే ఎన్డీయే బలం 151కి చేరుకుంటుంది. తృణమూల్ నుంచి ఇటీవల ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసిన నేపథ్యంలో ఉపఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలు నిర్వహించే ఈ మూడుసీట్లనూ భాజపా గెలుచుకునే అవకాశం ఉంది. దీంతో ఎన్డీయే సంఖ్యా బలం 154కు చేరనుంది. అయినప్పటికీ మూడింట రెండొంతుల మెజారిటీకి 163 మంది ఎంపీల మద్దతు అవసరం. అంటే 9 స్థానాలు తక్కువ పడతాయి. మరింత మంది తృణమూల్ రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసి ఎన్డీయేలో చేరితే 163 మార్కును చేరుకోవడం సాధ్యమవుతుంది.

ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 10 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనుంది. అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీ బలం పెరిగిన నేపథ్యంలో ఆ పార్టీ కొందరు ఎంపీలను రాజ్యసభకు పంపేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ మేర భాజపా ఎంపీల సంఖ్య తగ్గనుంది. ఒకవేళ 2/3 మెజారిటీ సాధించినా కొన్ని నెలల మురిపెం కానుంది. మరోవైపు ఇండియా కూటమికి పెద్దల సభలో 64 మంది ఎంపీలు ఉన్నారు. డీఎంకేకు చెందిన 8 మంది, ఆప్‌నకు చెందిన ముగ్గురు ఇండియా కూటమికి దూరంగా ఉండడంతో విపక్ష కూటమి బలం తగ్గుముఖం పట్టింది. మరోవైపు వైఎస్సార్‌సీపీ 7, బీజేడీ 7, వైగోకు చెందిన ఎండీఎంకేకు ఒక ఎంపీ ఉన్నారు. కీలక బిల్లుల సమయంలో వీరు ఎటువైపైనా మొగ్గు చూపొచ్చు.

లోక్‌సభలో ఇప్పట్లో కష్టమే: రాజ్యసభలో ఎన్డీయే ఎంపీల సంఖ్యా బలం పెరిగినా లోక్‌సభలో 2/3 కష్టమేనంటున్నాయి రాజకీయ వర్గాలు. తృణమూల్ నుంచి వేరుపడిన 20 మంది ఎంపీలు ఎన్డీయేకు మద్దతు తెలుపుతూ సోమవారం లేఖ ఇవ్వనున్నారు. దీంతో ఎన్డీయే సంఖ్య బలం 314కు చేరనుంది. మూడింట రెండొంతుల బలం సాధించాలంటే 363 మంది ఎంపీల మద్దతు అవసరం.

## దిల్లీ అగ్నిప్రమాదం.. ప్లాన్ ప్రకారం చేసిందే..

మొదటిపేజీ తరువాయి

వాహనాలకు నిప్పు అంటించింది గోవిందపురికి చెందిన 17ఏళ్ల బాలికగా పోలీసులు గుర్తించారు. బాలికను అదుపులోకి తీసుకొని విచారించగా ఐదో అంతస్తులో నివసించే దీపక్ అనే వ్యక్తికి చెందిన స్కూటర్‌కు నిప్పు పెట్టాలని సరిత అనే మహిళ చెప్పినట్లు వెల్లడించింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులు అదే ప్రాంతానికి చెందిన నిరంజన్ అతడి సోదరుడు రాజ్‌కుమార్‌లు అని పోలీసులు వెల్లడించారు. బంధువైన దీపక్‌తో వ్యక్తిగతంగా, ఆర్థికంగా ఉన్న విభేదాల కారణంగా అతడిపై కక్ష సాధించడానికి ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపారు. ఇందుకోసం బాలికతో పాటు మరో నిందితురాలు సరితను ఉపయోగించుకున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మైనర్‌ను కస్టడీలోకి తీసుకున్నామని.. సరిత, నిరంజన్, రాజ్‌కుమార్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు.. ఆరా తీసిన హోం మంత్రి

మొదటిపేజీ తరువాయి

అమరావతి: చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసుపై హోం మంత్రి వంగలపూడి అనిత కాకినాడ జిల్లా ఎస్పీతో మాట్లాడారు. కేసు వివరాలపై ఆరా తీశారు. హోం మంత్రి ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫారెస్ట్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ సందర్భంగా అధికారులకు హోం మంత్రి పలు సూచనలు చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. ఈ కేసులో అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని హోం మంత్రి తెలిపారు. కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి గత శనివారం అదృశ్యమైన విషయం తెలిసిందే.

## రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్ అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన సర్కారు వేలాది మంది ఇళ్లను కూల్చిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. కేటీఆర్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దాసోజు శ్రవణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదన్నారు. మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి త్వరలో ఉపఎన్నిక వస్తోందని వ్యాఖ్యానించారు.

జనసముద్రం



# దేశ సేవలో 12 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి మోదీ ప్రభుత్వం

**జనసముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి మే 14**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమ అభివృద్ధి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల్లో భాగంగా గౌరవ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న మనబడి మన బాధ్యత (స్వచ్ఛ పాఠశాల) కార్యక్రమంలో భాగంగా నేడు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమం నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లాకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి శాలువాతో ఆత్మీయ స్వాగతం పలికారుఅనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన "మనబడి - మన బాధ్యత" కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు పాఠశాల ఆవరణను స్వయంగా శుభ్రపరిచి పరిశుభ్రమైన పాఠశాలలు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు విద్యార్థులకు పరిశుభ్రత క్రమశిక్షణ సామాజిక బాధ్యతల ప్రాముఖ్యతను వివరించారుతదనంతరం శ్రీ బండి సంజయ్ కుమార్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖులు మండల సత్యం బోట్ల వెంకటస్వామి రాజ విద్యాసాగర్ గురుస్వామి నివాసాలకు వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు గత 12 సంవత్సరాలుగా దేశాభివృద్ధి పేదల సంక్షేమం జాతీయ భద్రత మౌలిక సదుపాయాల కల్పన మహిళా సాధికారత రైతు



సంక్షేమం మరియు భారతదేశ ప్రతిష్టను ప్రపంచ వేదికపై

మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు చేపట్టిన పలు కార్యక్రమాలు సంస్కరణలు మరియు విజయాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాలను అందజేశారుఅదేవిధంగా కార్యక్రమాల అనంతరం వివిధ కుల సంఘాల నాయకులు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తమ ప్రాంతాలకు సంబంధించిన పలు సమస్యలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు వారి సమస్యలను ఓర్పుగా విన్న బండి సంజయ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్ మరియు మట్టా వెంకటేశ్వర్ రెడ్డి ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతి సిరికొండ శ్రీనివాస్ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్ జిల్లా ఉపాధ్యక్షులు బర్కం లక్ష్మి నవీన్ యాదవ్ శీలం రాజు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి జిల్లా కార్యదర్శులు కర్నే హరీష రేవంత్ సెన్సార్ బోర్డు సభ్యురాలు వైశాలి సురేష్ పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మున్సిపల్ కౌన్సిలర్లు కొండ వర్షిణి నరేష్ మెరుగు మంజుల శ్రీనివాస్ బీజేపీ సీనియర్ నాయకులు గరిపెల్లి ప్రభాకర్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సూరారం గ్రామ రైతుల సమస్యలపై కీలక తీర్మానం

**•హనుమకొండ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్**

**ఎల్కతుర్తి, జూన్ 14:(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించి కీలక తీర్మానాన్ని ఆమోదించారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.సమావేశంలో రైతులు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సమస్యలను పరిష్కరించడం, నాణ్యమైన విత్తనాలు మరియు ఎరువులను అందుబాటులో ఉంచడం, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతుల సంక్షేమానికి తక్షణ చర్యలు చేపట్టడం వంటి డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ తీర్మాన ప్రతిపాదనను తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ప్రవేశపెట్టగా, సమావేశంలో పాల్గొన్న రైతులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.రైతులు ఆమోదించిన తీర్మానాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు."రైతు బలపడితేనే గ్రామం బలపడుతుంది.. గ్రామం బలపడితేనే దేశం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొంటూ, రైతుల హక్కులు మరియు సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని హింగే భాస్కర్ స్పష్టం చేశారు.

## నాలుగవ వార్డులో దెబ్బతిన్న మంచినీటి పైప్ లైన్ ను మరమ్మతులు చేపించిన వార్డు సభ్యులు..

**దామరచర్ల మండలం.జూన్ 14.(జనసముద్రం న్యూస్):**



మండల కేంద్రంలోని నాలుగవ వార్డులో మంచినీటి సరఫరా పైప్ లైన్ దెబ్బతినడంతో సమస్య ఏర్పడింది,సమస్యను గుర్తించిన వార్డు సభ్యులు షైక్ నసీమా రఫీ భాయ్ వెంటనే స్పందించి గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు,వార్డు సభ్యుల సూచన మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దెబ్బతిన్న పైప్ లైన్ కు మరమ్మతు పనులు చేపట్టారు,పైప్ లైన్ మరమ్మతు పూర్తి కావడంతో పాటు ప్రజలకు తిరిగి సక్రమంగా తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించడంలో సహకరించిన గ్రామపంచాయతీ సిబ్బందికి మరియు వార్డు సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు,వార్డు అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుంటామని వార్డు సభ్యులు షేక్ నసీమ రఫీ భాయ్ తెలిపారు.

# సాయినాథుని సన్నిధిలో ఆధ్యాత్మిక మహోత్సవం.. మూడు రోజుల వేడుకలకు సర్వం సిద్ధం

**•నేటి నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలులి**

**చింతపల్లి, జూన్ 14 : జనసముద్రంన్యూస్ ప్రతినిధి**





RAM_1705.JPG

చింతపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సాయిసన్నిధి ఆలయంలో 19వ వార్షికోత్సవ నవదశమి మహోత్సవాలు జూన్ 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుండగా, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.మహోత్సవాల మొదటి రోజు జూన్ 15న మంగళవాయిద్యాలు, వేదస్వస్తి, గోపూజలతో కార్యక్రమాలు. ప్రారంభమవుతాయి. అనంతరం యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, మహాపుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, ఆలయ విగ్రహ సంప్రోక్షణ తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.జూన్ 16న గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తు హోమం, మన్యుపాశుపత హవనాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

ఉత్సవాల్లో భాగంగా జూన్ 17న ఉదయం 11 గంటలకు లక్ష్మీనారాయణ స్వరూపమైన వేప-రావి వృక్షాలకు వృక్ష కళ్యాణం జరగనుండగా, సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం నుండి విచ్చేసే కల్యాణమూర్తుల సమక్షంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.అనంతరం రాత్రి 7:30 గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మరియు శ్రీ సాయినాథుల వారి ఉమ్మడి మహా ఊరేగింపు చింతపల్లి పురవీధుల్లో భక్తుల హర్షధ్వానాల మధ్య వైభవంగా సాగనుంది.ప్రత్యేకంగా, ఏప్రిల్ 12న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించబడిన "శ్రీ సాయి సన్నిధి చింతపల్లి యూట్యూబ్ ఛానల్ ద్వారా కూడా ఈ మహోత్సవాలను భక్తులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించారు.ధర్మాన్ని రక్షించండి.. ధర్మమే మనల్ని రక్షిస్తుంది అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ సనాతన ధర్మ మహోత్సవాల్లో భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, శ్రీ సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఈ రోజుతో జన్నారం లయన్స్ క్లబ్ చలివేంద్రం ముగింపు కార్యక్రమం

**మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, జూన్ 14,**



**జనసముద్రం:-**

జన్నారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత 48 రోజులుగా చలివేంద్రాన్ని ప్రారంభించుకుని నిరంతరాయంగా మండల ప్రజల దప్పికను తీరుస్తూ నేడు ముగింపు కార్యక్రమం లో భాగంగా అధ్యక్షులు లయన్ తోట లచ్చన్న, ప్రధాన కార్యదర్శి లయన్ ఎర్ర ప్రవీణ్ కుమార్ ,కోశాధికారి లయన్ కామెర ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ చలివేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ అనుమల రాజన్న మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా జన్నారం మండల కేంద్రంలో ప్రజల యొక్క దాహార్తిని తీరుస్తూ, నిరంతరాయంగా 48 రోజులు చల్లటి నీటిని మండల ప్రజలకు అందిస్తున్నందుకు సంతప్తిని వ్యక్తం చేస్తూ. దీనికి సహకారాన్ని అందించిన ప్రతి లయన్ మరియు నాన్ లయన్ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇటీవల మండల విద్యాధికారిగా సుదీర్ఘకాలం పదవి బాధ్యతల నుండి విరమణ పొందిన లయన్ నడిమెట్ల విజయకుమార్ గారిని ఘనంగా సన్మానిస్తూ వారు గత 12 సంవత్సరాలు లయన్స్ క్లబ్ కు చేస్తున్న సేవను కొనియాడుతూ, వారికి చిరు సత్కారం తో గౌరవించడం జరిగింది. చలివేంద్రానికి సహకరించిన మిత్రులకు చిరు బహుమతి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్ సైన్ల మల్లేష్ ,లయన్ బండారి మారుతి రాజు. గుండా సుధాకర్ మరియు మండల ప్రజలు పాల్గొనడం జరిగింది.

# గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

**జన సముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి జూన్ 14**

ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు

వేములవాడ నాంపల్లి 6వ వార్డు

సుమారు 11 నెలల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లిన నాంపల్లి గ్రామానికి చెందిన దండుగుల రాజయ్య (తండ్రి: లక్ష్మయ్య) అక్కడ అనారోగ్యంతో మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న రాజయ్య అకాల మరణంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు

ఈ నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ప్రత్యేక చొరవ చూపారు సంబంధిత శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ గల్ఫ్ బాధిత కుటుంబాలకు అందించే సంక్షేమ పథకాల కింద రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు అయ్యేలా కృషి చేశారు ఆయన



పట్టుదలతో ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా మొత్తం బాధిత కుటుంబానికి అందడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు

ఈ సందర్భంగా దండుగుల రాజయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్టకాలంలో అండగా నిలిచి ప్రభుత్వ సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు

అదేవిధంగా నాంపల్లి 6వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజాసేవా తీరును ప్రశంసించారు ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన పేరు సంపాదించుకున్నారని గల్ఫ్ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు


ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ కాశం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు

బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సేవలను నాంపల్లి గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## రాయపాటి వారి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా, జూన్ 14;**





మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని పట్లవీడు పంచాయతీ శివలింగాపురం గ్రామంలో జరిగిన రాయపాటి మల్లయ్య కుమార్తె పుష్పాలంకరణ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని, చిన్నారిని ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు బాణాసంచా కాలుస్తూ అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్లవీడు(బత్తుల అంకమరావు), యర్రబాలెం(రాయంకుల కృష్ణ, నలబోతుల రవి), శివలింగాపురం, ముటుకూరు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వల్భాపూర్ స్మశానవాటికలో నీటి సౌకర్యం ఏర్పాటు - గ్రామస్తుల హర్షం

**•సర్పంచ్ శ్వేతా శ్రీనివాస్, ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్ కృషితో**

**ఎల్కతుర్తి, జూన్ 14(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్ గ్రామ స్మశానవాటికలో నీటి సౌకర్యం లేక అంతిమయాత్రలు, అంత్యక్రియల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బోర్ పిట్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యాన్ని కల్పించారు.స్మశానవాటికలో నీటి అవసరాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ శ్వేత, ఉప సర్పంచ్ అనిల్ కుమార్, వార్డ్ సభ్యుడు కిషోర్ ప్రత్యేక శ్రద్ధతో బోర్ పిట్ తవ్వించి నీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అంత్యక్రియల నిర్వహణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ



సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసరమైన సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించిన ప్రజాప్రతినిధులను అభినందించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ శ్వేత, ఉప సర్పంచ్ అనిల్ కుమార్, వార్డ్ సభ్యుడు కిషోర్ సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.స్మశానవాటికలో నీటి సౌకర్యం ఏర్పాటుతో గ్రామ



ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిందని స్థానికులు తెలిపారు.

# విజయపురి సౌత్ ప్రభుత్వ ఆసుపత్రి -- సుఖప్రసవం

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూన్ 14**

విజయపురి సౌత్ ప్రభుత్వ ఆసుపత్రిలో, డి.సి. తండాకు చెందిన గర్భిణి శ్రీమతి శ్రీలత గారు ప్రసవం కోసం విచ్చేయగా, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్. దత్త శ్రీ గారి సమయోచిత వైద్య సేవలతో సుఖప్రసవం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా, 3.6 కిలోల బరువుతో ఆరోగ్యవంతమైన మగబిడ్డ జన్మించడం జరిగింది. తల్లి--బిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ విజయవంతమైన ప్రసవం సందర్భంగా



డాక్టర్ దత్త శ్రీ గారు స్టాఫ్ నర్స్ రంగమ్మ గారికి మరియు ఆసుపత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. వైద్యుల సమయోచిత సేవలు, ఆసుపత్రి సిబ్బంది కృషి వల్లే ఈ సుఖప్రసవం సాధ్యమైందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# నర్సరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట పాలపాడు టిడిపి నేత పులిమి రామిరెడ్డి ధర్నా

**జనసముద్రంన్యూస్, నరసరావుపేట, పల్నాడు జిల్లా, జూన్ 14;**



రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న తమపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ, శనివారం నాడు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి నేత, పాలపాడు గ్రామానికి చెందిన పులిమి రామిరెడ్డి ఆందోళనకు దిగారు. స్టేషన్ ముందు బైఠాయించి పోలీసుల ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పులిమి రామిరెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల రోడ్డు కష్టాలను తీర్చేందుకు పాలపాడు నుండి అన్నవరం వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం చుట్టగా గ్రామంలోని రైతులందరూ సహకరించారని తెలిపారు. అయితే, రాయపాటి నాగేశ్వరరావు అనే ఒకే ఒక్క రైతు మాత్రం ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డు పనుల కోసం సదరు రైతు ఇంటికి వెళ్లి, ఎమ్మార్వో సమక్షంలో ఎంతో బ్రతిమిలాడామని ఆయన వివరించారు. అయినప్పటికీ, అతని కుమారుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయంలో తిరుగుతూ అక్కడి నుండి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. లోకేష్ కార్యాలయం పేరు చెప్పుకుంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చి గత ఆరు నెలల్లో తనపై ఐదు అక్రమ కేసులు బనాయించారని రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు కూడా తాము ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించడానికి రూరల్ పోలీసులు నిరాకరించారని కనీసం సమాధానం కూడా చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. "మేము అధికార పార్టీలో ఉన్నామో లేదో కూడా అర్థం కావడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. పాలపాడులో అసలు ఏం జరుగుతుందో వాస్తవాలను తెలుసుకోవాలని మీడియా మరియు ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాలని కోరుతూనే తాను పోలీస్ స్టేషన్ ముందు నిరసనకు కూర్చున్నట్లు రామిరెడ్డి స్పష్టం చేశారు. ఈ నిరసనలో ఆయనతో పాటు పలువురు స్థానికులు కూడా పాల్గొన్నారు.

# శ్రీ ధాత్రే నమః ట్రస్ట్ సహకారం తో నేటి నుండి 27 వరకు జరుగనున్న ఉచిత ధార్మిక పరిష్కారాల శిబిరం

- పాల్గొననున్న శ్రీ ధాత్రే నమః ట్రస్ట్ మరియు శ్రీ నాగభూషణ శాస్త్రి గారి శిష్య బృందం

**జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, పల్నాడు జిల్లా, జూన్ 13 ;**



ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి వల్ల మానవులు ఎన్నో రకాల శారీరక, మానసిక అనారోగ్యాలతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని మనకు తెలిసిందే. మరి ఈ సమస్యలకు ఒక అద్భుతమైన పరిష్కారాలను అందిస్తుంది శ్రీ ధాత్రే నమః ట్రస్ట్. దివంగత ప్రముఖ విద్యావేత్త, వై.ఆర్.యస్ హైస్కూల్ (పల్నాడు జిల్లా, రెంటచింతల (గ్రామం) హెడ్‌మాస్టర్ కీ.శే. శ్రీ నాగభూషణ శాస్త్రి ఆశయాల స్ఫూర్తితో, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీ ధాత్రే నమః ట్రస్ట్ సహకారంతో జూన్ 15 నుండి 27 వ తేదీ వరకు ఉచిత ధార్మిక పరిష్కారాల శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

నాగభూషణ శాస్త్రి కుమారుడు మరియు బ్రహ్మచారి అయిన డాక్టర్ బ్రహ్మశ్రీ కంభంపాటి చెన్నకేశవ శాస్త్రి సుదీర్ఘకాలం పాటు వేదాధ్యయనము చేశారు. వేదమంత్రాలలో నిగూఢంగా నిక్షిప్తమై ఉన్న విషయాల ద్వారా మానవాళి ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలకు వైదిక ధార్మిక పద్ధతులలో అద్భుతమైన పరిష్కారాలను ఆయన కనుగొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 80 రకాల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా ధార్మిక పరిష్కారాలు చూపించబడతాయి.

ముఖ్యమైన వివరాలు

తేదీలు: జూన్ 15 (సోమవారం) నుండి జూన్ 27 (శనివారం) వరకు.

స్థలం: శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, పాలువాయి జంక్షన్(పల్నాడు జిల్లా).

శిబిరం జరిగే సమయం : ప్రతిరోజు ఉదయం 8గం.ల నుండి మధ్యాహ్నం 12గం.ల వరకు.

గమనిక – పేర్లు నమోదు

శిబిరం ప్రారంభ రోజైన నుండే. 15-06-2026 (సోమవారం) ఉదయం 9:00 గంటలకు ప్రారంభోత్సవం మరియు పేర్లు నమోదు కార్యక్రమం ఉంటుంది. కావున లబ్ధిదారులు మొదటి రోజే తమ పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత రోజుల నుండి ఉదయం 8 గంటలకే శిబిరం ప్రారంభమవుతుంది.

గ్రామ ప్రజలకు నిర్వాహకుల పిలుపు: ఇది పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతున్న సేవా శిబిరం. కావున పాలువాయి జంక్షన్ మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ఉండే ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మీకున్న దీర్ఘకాలిక సమస్యల బాధల నుండి విముక్తి పొందాలని శ్రీ ధాత్రే నమః ట్రస్ట్ మరియు శ్రీ నాగభూషణశాస్త్రి శిష్య బృందం భక్తితో ప్రజలను కోరుతోంది. మరిన్ని వివరాలకు.. శ్రీ ధాత్రే నమః ట్రస్ట్ మరియు నాగభూషణశాస్త్రి శిష్య బృందం, పాలువాయి జంక్షన్. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు.. యర్రెద్దు ప్రసాద రెడ్డి - 90144 10447, గుండా రామమూర్తి - 99891 57109.

# రక్తదానం ప్రాణధానం తో సమానం

**పొత్తూరి రామరాజు**

**నరసాపురం జూన్ 14 జనసముద్రం పశ్చిమగోదావరిజిల్లా ప్రతినిధి ధనుంజయ్**





ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నరసాపురం పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రక్తదాన ప్రాముఖ్యతను తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించి, అనంతరం ప్రధాన కూడలిలో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ, రక్తదానం అనేది అత్యంత విలువైన మానవతా సేవ అని, ఒక వ్యక్తి స్వచ్ఛందంగా అందించే రక్తం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం అత్యంత అవసరమవుతుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రక్తదాన కార్యక్రమాల్లో ముందుండి పాల్గొని సేవాభావాన్ని చాటాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ఇది పూర్తిగా సురక్షితమైన మరియు శాస్త్రీయమైన ప్రక్రియ అని వివరించారు. ప్రజల్లో ఇంకా ఉన్న అపోహలను తొలగించి, రక్తదానంపై మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని రామరాజు అన్నారు. "రక్తదానం అనేది కేవలం ఒక దానం కాదు, అది ఒక ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ" అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, నాగిడి రాంబాబు, దొంగ పద్మారావు, తిరుమాని హేమంత్, పట్నాల జగన్, దొంగ మురళీ, యలమంచిలి విజయ్, మోక శ్రీను బొర్రా చిన్నయమ్మ, చీకట్ల కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# నాకు రక్షణ కల్పించండి మహాప్రభో

**మొగల్తూరు జూన్ 14 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**



నరసాపురం పట్టణానికి చెందిన గాడి నెహ్రూ అనే వ్యక్తి నుండి తనకు ప్రాణహాని ఉందని మొగల్తూరు గ్రామానికి చెందిన ప్రముఖ దస్తావేజు లేఖరి కొల్లాటి వెంకటేశ్వరరావు ఆరోపించారు. శనివారం మొగల్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు గల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను నరసాపురం పట్టణానికి చెందిన భవాని మనోహర్ కృష్ణ నుండి 2015లో బాకీ ఉన్న రూ పదిహేను లక్షలు చెల్లించలేదని బాకీ వెంటనే చెల్లించాలని లేదా నన్ను నా కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తానని బెదిరింపులు బెదిరిస్తున్నారని తెలిపారు. 2016 నుండి ఈ సమస్య ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి మరియు సంబంధిత అధికారులకు నాకు ప్రాణహాని ఉన్నట్లు ఫిర్యాదు చేసి ఉన్నానని తెలిపారు. తన పైన తన వ్యక్తిగత పలుకుబడి పైన అసత్య ప్రచారాలు చేస్తూ ఒక కరపత్రాన్ని మొగల్తూరు నరసాపురం పాలకొల్లు భీమవరం సబ్ రిజిస్టర్ కార్యాలయముల యందు పంపిణీ చేసి తన పరపతిని పలుకుబడిని తన కుటుంబ సభ్యులను అవమానం కల్పించారని తెలిపారు. ప్రస్తుతం తనను తన కుటుంబ సభ్యులను చంపుతానని మరల బెదిరింపులకు పాల్పడుతున్న గాడి నెహ్రూ పై పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయునన్నట్లు ఆయన వెల్లడించారు.

# శ్రీ శ్రీదేవి. భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి నీ దర్శించుకున్న లక్కిరెడ్డిపల్లె సీఐ.

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూన్ 14**



లక్కిరెడ్డిపల్లి మండలం లోని దేవలంపల్లిలో ఉన్నటువంటి శ్రీశ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న లక్కిరెడ్డిపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్ దంపతులతో కలసి దర్శించుకోవడం జరిగింది.కుర్నూతల గ్రామం దేవళం పల్లె శ్రీ చెన్నకేశవ స్వామి వారిని.కుటుంబ సమేతంగా దర్శించుకోవడం జరిగింది.ఆలయ పూజారులు. ఆయనను దుశ్శాలతో సత్కరించి వేదమంత్రాలతో పూజలు చేయించారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆలయ పూజారులు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

# బాసర ఐఐఐటీ లో సీటు సాధించిన పీఏపల్లి విద్యార్థి




**జనసముద్రంన్యూస్, పీఏపల్లి మండలం, నల్గొండ జిల్లా, జూన్ 14;**

నల్గొండ జిల్లా పీఏపల్లి జడ్పీహెచ్ స్కూల్ లో చదివిన మెగావత్ రాము కుమారుడు మెగావత్ రవితేజ కు బాసర ఐఐఐటీ లో సీటు రావటం ఎంతో సంతోషించదగ్గ విషయం అని యువ నాయకులు మెగావత్ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతర కృషి, పట్టుదలతో ప్రతిభ కనబరిచి బాసర ఐఐఐటీ లో సీటు పొందినందుకుగాను పీఏపల్లి జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, స్కూల్ కమిటీ, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.



శుభాకాంక్షలు తెలియజేసిన మెగావత్ రామకృష్ణ

# టిడిపి పార్టీలోకి భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీ లేక ఆహ్వానించిన మంత్రి మండిపల్లి



**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూన్ 14**

తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన పలు కుటుంబాలు టిడిపిలో చేరడం జరిగింది లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడు గ్రామం వడ్డేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో లిమంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

లి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని ఆత్మీయంగా ఆహ్వానించిన మంత్రి , పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు

"ప్రజల విశ్వాసమే టిడిపి బలం.. అభివృద్ధే మా లక్ష్యం" అని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అటవీ శాఖ డైరెక్టర్ వై పెద్ద రెడ్డయ్య యాదవ్ , మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ క్లస్టర్ కన్వీనర్ శంకారపు జయరాం లక్కిరెడ్డిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీరాజు , చెరువు చైర్మన్ మోహన్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బాసర ఐఐఐటీ లో సీటు సాధించిన మెగావత్ రవితేజ కు కంగ్రాట్స్ లేషన్స్ తెలియజేసిన నవులూరి శివారెడ్డి




**జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, పల్నాడు జిల్లా, జూన్ 14;**

నల్గొండ జిల్లా పీఏపల్లి జడ్పీహెచ్ స్కూల్ లో చదివిన మెగావత్ రాము కుమారుడు మెగావత్ రవితేజ కు బాసర ఐఐఐటీ లో సీటు రావటం ఎంతో సంతోషించదగ్గ విషయం అని అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతర కృషి, పట్టుదలతో ప్రతిభ కనబరిచి బాసర ఐఐఐటీ లో సీటు పొందినందుకుగాను పీఏపల్లి జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, స్కూల్ కమిటీ, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు శు భాకాంక్షలు తెలియజేశారు.



నవులూరి శివారెడ్డి, అమరావతి పార్టీ మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీల ఎమ్మెల్యే అభ్యర్థి.

# సుబ్బయ్యకు శ్రద్ధాంజలి ఘటించిన శ్రీకాంత్ రెడ్డి



**రామాపురం జనసముద్రం న్యూస్ జూన్ 14**

రామాపురం మండలం హసనాపురం నకు చెందిన సుబ్బయ్య దశదిన ఖర్మ ఖాండ కార్యక్రమం శనివారంజరిగింది.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాగేంద్ర రెడ్డి,చలమా రెడ్డి,ఈశ్వర్ రెడ్డి, చంద్ర, అజీ0, యోగీశ్వర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి,రవీంద్ర రెడ్డి,ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘పెద్ది’పై విమర్శలు.. ప్రతి పెళ్లిలోనూ అలాంటోడు ఒకడు ఉంటాడు: బుచ్చిబాబు



“ఎక్కడ పెళ్లి జరిగినా ఎవడో ఒకడు వచ్చి, ‘ఇది బాగోలేదు.. అది బాగోలేదు’ అని అంటాడు. అవన్నీ చిన్న చిన్న విషయాలు. నాది ‘పెద్ది’ తరహాలో పోరాడే పాత్ర” అన్నారు దర్శకుడు బుచ్చిబాబు. రామ్‌చరణ్ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అదే సమయంలో కథానాయిక జాన్వీకపూర్ పాత్ర చిత్రీకరణపైనా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో బుచ్చిబాబు క్షమాపణ కూడా చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం చిత్ర బృందం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడారు. “పెద్ది’లో యాడ్ చేసే సీన్స్ బుధవారం నుంచి థియేటర్లలో ప్రదర్శితమవుతాయి. కథానాయిక జాన్వీకపూర్‌తో పాటు, జగపతిబాబుకు సంబంధించిన సన్నివేశాలు యాడ్ చేస్తున్నాం. ఈ సినిమా చూసిన వారందరూ మెచ్చుకుంటున్నారు. నాలుగైదు శాతం మంది మాత్రమే అసలు కథ కాకుండా వేర్వేరు అంశాలు మాట్లాడారు. 95 శాతం సినిమా అందులోని క్రీడా స్ఫూర్తిని, చరణ్‌గారి నటనను ప్రశంసించారు. ఏ థియేటర్‌కు వెళ్లినా అలాంటి స్పందనే ఉంది” అని అన్నారు.

జాన్వీ పాత్ర చిత్రీకరణపై వచ్చిన విమర్శకులకు దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెప్పడం తనకు నచ్చలేదని సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ అన్నారు. “ఒక పాత్రను ఎలా తీయాలి? అది ఏ విధంగా ఉంటుందనేది దర్శకుడి ఊహ. ఇంగ్లీష్ బాగా వచ్చి, పీహెచ్‌డీ, పట్టభద్రులైన వారు మాట్లాడిందే నిజమని ఇప్పటికీ చాలా మంది అనుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్‌మీడియాలో బాగా మాట్లాడేవాళ్ల అభిప్రాయాలను ఇతరులపై రుద్దడంతో వారంతా ప్రభావితమయ్యారు. దర్శకుడికి ఈ మాత్రం స్వేచ్ఛ ఇవ్వకపోతే ఎలా? ఇలాగే విమర్శించుకుంటూ వెళ్తే దర్శకుల సృజనాత్మకతను తొక్కేసినట్లే. కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయని ప్రజాస్వామ్యబద్ధంగా బుచ్చిబాబు క్షమాపణ చెప్పి ఉండొచ్చు. నాకైతే నచ్చలేదు. ఇలాగే చేస్తుంటే, భవిష్యత్‌లో డాక్యుమెంటరీలు తప్ప, కమర్షియల్ సినిమాలు రావు. ఐటమ్ సాంగ్‌ను ఐటమ్ సాంగ్‌గానే స్వీకరించాలి. అదొక స్పెషల్ ఐటెం టేస్ట్ చేసినట్టు” అంటూ అనంత్ శ్రీరామ్ కాస్త ఘాటుగా సమాధానమిచ్చారు. మరోవైపు ఆదివారం నుంచి ఈ మూవీ టికెట్ ధరలు తగ్గాయి. దీంతో రెవెన్యూ మరింత బాగుందని ఈ సందర్భంగా చిత్ర బృందం తెలిపింది.

# చిదంబరంతో కలిసి మోహన్‌లాల్ మూవీ? క్లారిటీ ఇచ్చిన దర్శకుడు



‘మంజుమ్మల్ బాయ్స్’ దర్శకుడు చిదంబరం, ప్రముఖ నటుడు మోహన్‌లాల్ తో కలిసి పనిచేయబోతున్నారన్న వార్తలు ఇటీవల బాగా ప్రచారంలోకి వచ్చాయి. దర్శకుడి తండ్రే స్వయంగా ఈ విషయాన్ని పంచుకోవడంతో, అందరూ అది ఖరారైనట్లేనని భావించారు. అయితే, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చిదంబరం దీనిపై స్పష్టతనిచ్చారు. మోహన్‌లాల్‌తో ఏ ప్రాజెక్ట్‌పై చర్చించలేదని వెల్లడించారు. తన తండ్రి ఏదో వదంతి విని దానిని సోషల్ మీడియాలో పంచుకుని ఉండొచ్చన్నారు. సాధారణ సందర్భాల్లో మోహన్‌లాల్‌ను కలిసినప్పటికీ.. ప్రాజెక్ట్ గురించి మాత్రం చర్చ జరగలేదని చిదంబరం తెలిపారు.
మోహన్‌లాల్‌తో సినిమా చేసే ఆలోచన ఏమైనా ఉందా? అని విలేకరి అడిగినప్పుడు, “ఒకవేళ అవకాశం వస్తే.. ఆ సినిమా ప్రేక్షకులు ఆశించే అద్భుతమైన సన్నివేశాలతో కూడిన వినోదాత్మక చిత్రంగా ఉంటుంది” అని ఆయన బదులిచ్చారు. ఇక చిదంబరం ‘బాలన్’ అనే తదుపరి చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మోహన్‌లాల్ చివరిగా ‘దృశ్యం 3’ లో ప్రధాన పాత్ర పోషించిన విషయం తెలిసిందే.



# ‘కాంచన 4’లో నయన్?

ఈ ఏడాది ప్రారంభంలోనే ‘మన శంకరవరప్రసాద్ గారు’ చిత్రంతో ‘మీసాల పిల్లా’ అంటూ కుర్రకారుని పాటలు పాడుకునేలా చేసింది అగ్రకథానాయిక నయనతార. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా ‘హాయ్’, ‘టాక్సిక్’, ‘డియర్ స్టూడెంట్స్’ లాంటి వరుస ప్రాజెక్టులతో తీరిక లేకుండా గడుపుతోందీ భామ. ఇప్పుడీమె ఖాతాలోకి మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. తెరకెక్కిస్తున్న చిత్రం ‘కాంచన 4’. ఈ హారర్ కామెడీలో ఓ ప్రత్యేక పాత్రలో నయన్ మెరవనున్నట్లు సమాచారం. ఈ సినిమాలోని ఫ్లాష్‌బ్యాక్‌కు సంబంధించిన కీలక సన్నివేశాల్లో ఆమె కనిపించనున్నట్లు తమిళ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ‘కాంచన’ ఫ్రాంచైజీలో రాబోతున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ‘నాగబంధం’.. 3 గంటల 15 నిమిషాల నిడివి ఎక్కువేనా?



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్ ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’ . ఇటీవల ప్రేక్షకుల్లో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న తెలుగు చిత్రాలలో ఇది ఒకటి. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా.. అద్భుతమైన విజువల్స్‌తో మంచి హైప్‌ను సృష్టిస్తోంది. ‘నాగబంధం’ సుమారు 3 గంటల 15 నిమిషాల నిడివితో విడుదలకు సిద్ధమవుతోంది. సాధారణంగా ఇది కాస్త ఎక్కువగా అనిపించినప్పటికీ.. సినిమా కథాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే పెద్ద సమస్య కాదు. మిస్టరీ, పురాణ గాథలు, నిధులు, సాహసయాత్ర ప్రధానాంశాలుగా కథ సాగుతుంది. కంటెంట్ ఆకట్టుకునేలా ఉండడంతో ఈ నిడివి చిత్రానికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. 2026 ఫిబ్రవరి 15న టీజర్ విడుదలై సానుకూల స్పందన లభించడంతో ప్రేక్షకులలో అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నాగర్కర్, రిషబ్ సాహ్నీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ‘డ్యూడ్ 2’ సన్నాహాలు

‘దేవదాస్ సార్..’ అంటూ ‘డ్యూడ్’ సినిమాతో కుర్రకారుని అలరించింది మలయాళ భామ మమితా బైజు. ఆమె, హీరో ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన చిత్రమిది. కీర్తిశ్వరన్ దర్శకత్వం వహించారు. ప్రేమ, స్నేహం లాంటి అంశాలతో రూపొందిన ఈ చిత్రంలో మమిత, ప్రదీప్‌ల జోడీ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. గతేడాది విడుదలై యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమాకి.. ఇప్పుడు సీక్వెల్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు కీర్తిశ్వరన్ ‘డ్యూడ్ 2’ గురించి మాట్లాడుతూ.. “ఈ కొనసాగింపు చిత్రం గురించి ప్రదీప్ రంగనాథన్‌కు ఓ ఆలోచనను చెప్పాను. ఈ కథాలోచన అనుకున్నట్లుగా కార్యరూపం దాల్చితే.. సీక్వెల్‌ను త్వరలోనే పట్టాలెక్కిస్తాం” అని అన్నారు. ప్రస్తుతం మమిత ఖాతాలో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’, ‘ఇరండు వానం’ తదితర చిత్రాలున్నాయి.

# ‘లెనిన్’.. రెండు వారాలు వెనక్కి

కథానాయకుడు అఖిల్ అక్కినేని నటించిన ‘లెనిన్’ సినిమా మరోసారి వాయిదా పడింది. ఈనెల 26న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని.. రెండు వారాలు ఆలస్యంగా జులై 10న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ మేరకు చిత్ర నిర్మాత అక్కినేని నాగార్జున సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. “ప్రేక్షకులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించడం కోసం నాణ్యమైన అవుట్‌పుట్ ఇచ్చేందుకు మరింత సమయం కావాల్సి ఉంది. దీనికోసమే ఇప్పుడు చిత్ర బృందమంతా నిర్విరామంగా శ్రమిస్తోంది. అందుకే విడుదల తేదీని వచ్చే నెల 10కి మార్చాం. నేను మరోసారి చెప్తున్నా.. ఈ సినిమాతో అందరూ ఓ కొత్త అఖిల్‌ని చూస్తారు” అని నాగ్ పేర్కొన్నారు. ఈ సినిమాని మురళి కిశోర్ అబ్బూరు తెరకెక్కించగా.. సూర్యదేవర నాగవంశీతో కలిసి నాగార్జున నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

